క్లుప్తంగా

వ్యక్తి అరెస్ట్

ప్రొద్దుటూరు క్రైం : మండల పరిధిలోని మైదుకూరు రోడ్డులో ఉన్న లింగాపురం క్రాస్ వద్ద అక్రమంగా మద్యం బాటిళ్లు తీసుకెళ్తున్న కలమల వీరారెడ్డి అనే వ్యక్తిని శుక్రవారం సాయంత్రం అరెస్ట్ చేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. అతని వద్ద నుంచి 25 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వీరారెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివప్రసాద్ తెలిపారు.

ఘన సన్మానం

ప్రొద్దుటూరు : ప్రస్తుతం కూరగాయల మార్కెట్‌లో ఉన్న వ్యాపారులందరికి కొత్త మార్కెట్‌లో స్థలం కల్పించేందుకు మున్సిపాలిటీ నుంచి గుర్తింపు కార్డులు జారీ చేయాలని ఆదేశించినందుకు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవిలను శుక్రవారం మార్కెట్ వ్యాపారులు సన్మానించారు. అనంతరం మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్యలను కలసి స్వీట్లను అందించారు. కార్యక్రమంలో కూరగాయల మార్కెట్ వ్యాపారులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గౌరిపూజ

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో శుక్రవారం ఘనంగా గౌరీ పూజ నిర్వహించారు. అమ్మవారిని కొలువుదీర్చి పసుపు, కుంకుమ, దీపాలు, నైవేద్యంతో మహిళలు అర్చించారు. కర్పూర హారతులు ఇచ్చి తమ కోరికలు నెరవేర్చమని అమ్మవారిని భక్తిశ్రద్ధలతో వేడుకున్నారు. ఆలయ ప్రధానార్చకుడు శివస్వామి గౌరీపూజ చేయడం వల్ల కలిగే శుభాలను భక్తులకు వివరించారు. శనివారం గౌరీదేవి అమ్మవారిని నిమజ్జనం చేయనున్నారు. అలాగే వాసవీకన్యకా పరమేశ్వరిదేవికి, పార్వతీపరమేశ్వరులకు, సీతారామలక్ష్మణ ఆంజనేయస్వామి విగ్రహాలకు విశేష పూజాకార్యక్రమాలను నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు.

రబీ పంటలను నమోదు చేసుకోండి

మైదుకూరు : రబీ సీజన్‌లో తాము సాగు చేసిన పంటలను నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి పి.లక్ష్మీప్రసన్న తెలిపారు. అక్టోబర్ నుంచి సాగులో ఉన్న జొన్న, మినుము, నువ్వుతోపాటు ఉద్యానవన పంటలను కూడా రైతులు నమోదు చేసుకోవాలని సూచించారు. రైతులు తమ పట్టాదారు పాస్ పుస్తకం, వన్‌బీ, ఆధార్ కార్డు, ఫోన్ నంబర్‌ను తమ పరిధిలోని రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయ సహాయకుల వద్ద నమోదు చేయించుకోవాలని వివరించారు.

అంధులకు చేయూత



అంధులకు పింఛన్ అందచేస్తున్న అవధాని నరాల రామారెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : అందులకు సేవ చేయడం దైవకార్యమని అవధాని నరాల రామారెడ్డి పేర్కొన్నారు. స్థానిక రాయలసీమ ఫర్నిచర్స్ వద్ద శుక్రవారం గాజులపల్లె పెద్దసుబ్బయ్య, పెద్దసుబ్బమ్మ సేవా సంస్థ ఆధ్వర్యంలో 50 మంది అంధులకు ఒక్కొక్కరికి రూ.200 చొప్పున పింఛన్ అందచేశారు. భక్త పెంచలయ్య చొక్కాలను అందచేశారు. అలాగే శ్రీరాములు, వరదరాజులు, పెంచలయ్యలు ఒక్కొక్కరికి రూ.100, సుబ్బరత్నమ్మ, శ్రీనివాసులు రూ.50 చొప్పున, సురేష్‌కుమార్ బిస్కెట్ ప్యాకెట్‌లను, రిటైర్డ్ ఏఈ ప్రసాద్ బ్రెడ్ ప్యాకెట్‌లను అంధులకు అందించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు గాజులపల్లె రామచంద్రుడు, విశ్రాంత ఉద్యోగులు గోవిందరాజులు, గురప్ప, వీరయ్య, రాంప్రసాద్, రమణ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల నిరసన

ప్రొద్దుటూరు : ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో కార్మికులు శుక్రవారం నిరసన తెలిపారు. మున్సిపాలిటీలో పనిచేస్తున్న క్యాబ్ డ్రైవర్లకు పెండింగ్‌లో ఉన్న ఆరు నెలల వేతనాలను వెంటనే చెల్లించాలని, రూ.18,500 వేతనం ఇవ్వాలని యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు రాఘవేంద్ర, సాయి, రవికుమార్, రవి, సురేష్, ప్రమీలమ్మ, గుర్రమ్మ, నీతమ్మ, శాంతి, నరసమ్మ, అన్నపూర్ణ, క్యాబ్ డ్రైవర్లు పాల్గొన్నారు.

కేపీ ఉల్లికి శాశ్వత కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

మైదుకూరు : మైదుకూరు నియోజకవర్గంలో కేపీ ఉల్లి పంటకు శాశ్వత కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని ఏపీ రైతు సంఘం, సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ భౌగోళికంగా కేపీ ఉల్లి దేశానికి ప్రఖ్యాతి తెచ్చిపెట్టడమే కాకుండా ఆరోగ్యపరంగా కూడా పేరు పొందిందని తెలిపారు. ప్రస్తుతం మైదుకూరు నియోజకవర్గంలో దాదాపు 600 ఎకరాల్లో కేపీ ఉల్లి సాగయిందన్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే ఎగుమతి సుంకాన్ని రద్దు చేయాలని, రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ అనుబంధ ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.భాస్కర్, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి పి.శ్రీరాములు, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి ఏవీ శివరామ్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు బీవీ శ్రీనివాసులు, ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పెద్ద పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన కలిగిఉండాలి



ప్రొద్దుటూరు క్రైం : జిల్లా ఆస్పత్రి నుంచి ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది



బద్వేలు అర్బన్ : పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



మైదుకూరులో ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు



చాపాడులో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

ప్రొద్దుటూరు క్రైం : హెచ్‌ఐవీ బాధితులను ఆదరించడం అందరి బాధ్యత అని జిల్లా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆనంద్‌బాబు తెలిపారు. ప్రపంచ ఎయిడ్స్ దినం సందర్భంగా జిల్లా ఆస్పత్రి నుంచి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ ఎయిడ్స్ పట్ల ప్రజల్లో అవగాహన పెంచి ప్రభుత్వం అందించే సేవలను, వాటి ప్రాధాన్యతను వివరించాలని చెప్పారు. అనంతరం వాసవి సర్కిల్‌లో హెచ్‌ఐవీ నిర్మూలన ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఆర్‌టీ మెడికల్ ఆఫీసర్ సూర్య నాగలక్ష్మి, పీపీయూనిట్ మెడికల్ ఆఫీసర్ ఇళయరాణి, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, ఆయుష్ విభాగం వైద్యులు రాజేశ్వరి, అపర్ణ, నిరంజన్, ఐసీటీసీ కౌన్సిలర్ బాలగంగిరెడ్డి, నాగేంద్ర, డీఎస్ఆర్‌సీ కౌన్సిలర్ శ్రీరాములు పాల్గొన్నారు.

- మండల పరిధిలోని కామనూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ప్రపంచ ఎయిడ్స్ దినం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కామనూరు, గోపవరం, చౌటపల్లె, సోములవారిపల్లె పంచాయతీల్లో వైద్యాధికారులు హనీఫ్‌బాబా, శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో ఎయిడ్స్ వ్యాధి నివారణ కోసం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డీపీఎంఓ శ్రీను, సీహెచ్‌ఓ కృష్ణమ్మ, హెచ్‌ఈ శోభారాణి, హెచ్‌ఈఓ శ్రీను పాల్గొన్నారు.
- మండలంలోని కల్లూరు పీహెచ్‌సీ పరిధిలో ప్రపంచ ఎయిడ్స్ దినం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మునిరామప్రసాద్, రాజశేఖర్, మాధవరెడ్డి పాల్గొన్నారు.
- సిర్డ్ సొసైటీ ఆధ్వర్యంలో సాయికుటీర్ రోడ్డులోని లేపాక్షి డిగ్రీ కాలేజీలో ఎయిడ్స్‌పై అవగాహన సదస్సును నిర్వహించారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ శివశంకరయ్య, కళాశాల ప్రిన్సిపల్ రామచంద్రారెడ్డి, యూపీహెచ్‌సీ వైద్యాధికారి హిమబిందు, సిర్డ్ సొసైటీ అధ్యక్షుడు ఎంపీ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన ర్యాలీ

ప్రొద్దుటూరు : మండలంలోని కల్లూరు గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ ఎయిడ్స్ దినం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్లు మునిరాంప్రసాద్, రాజశేఖర్, ఎంపీహెచ్‌ఈఓ మాధవ రెడ్డి, మరియమ్మ పాల్గొన్నారు.

ఎయిడ్స్ రహిత సమాజ నిర్మాణమే లక్ష్యం

బద్వేలు అర్బన్ : ఎయిడ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ మల్లేష్, ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాంప్రసాద్‌లు పేర్కొన్నారు. ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా శుక్రవారం స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలతో ర్యాలీ నిర్వహించి అనంతరం ఎన్‌జీఓ హోంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ జోత్స్న స్వర్ణలత, డాక్టర్ వినయ్‌కుమార్, డాక్టర్ మహేష్, డాక్టర్ సౌమ్య, రూరల్ ఎస్ఐ చంద్రశేఖర్, సబ్ యూనిట్ అధికారి నరసింహారెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్ఎస్ ఆధ్వర్యంలో

ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా రాచపూడి నాగభూషణం డిగ్రీ, పీజీ కళాశాల ఎన్‌ఎస్ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో శుక్రవారం కళాశాలలో ఎయిడ్స్ నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్, ఐసీటీసీ కౌన్సిలర్ శ్రీనివాసులు, కో ఆర్డినేటర్ కవితలు, కళాశాల ఏఓ ఆర్.వి.సాయిక్రిష్ణ, ప్రిన్సిపల్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన, అప్రమత్తత అవసరం

పోరుమామిళ్ల : హెచ్‌ఐవీ, ఎయిడ్స్ పట్ల అప్రమత్తత, అవగాహన ఉండాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రెడ్డి, ప్రభుత్వ వైద్యులు వెంకటనాగేంద్ర అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్‌ఎస్ఎస్ విద్యార్థులు, ప్రభుత్వ వైద్యశాల సిబ్బంది పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ నాగేశ్వరరెడ్డి ఎయిడ్స్ వ్యాధి ఎలా వస్తుందో వివరిస్తూ, తీసుకోవాల్సి జాగ్రత్తలు తెలిపారు.

గోపవరం : ఎయిడ్స్ అంటువ్యాధి కాదని, అంటించుకునే వ్యాధి అని మండల వైద్యాధికారి డాక్టర్ ఇ.మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ప్రపంచ ఎయిడ్స్ డే పురస్కరించుకుని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి చిన్నగోపవరం వరకు వైద్య సిబ్బంది, గ్రామస్తులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, డాక్టర్ జి.మురళీక్రిష్ణ, సీహెచ్‌ఓ గౌస్, సూపర్‌వైజర్ మల్లేశ్వరమ్మ, హెల్త్ అసిస్టెంట్ సుబ్బారెడ్డి, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలి

మైదకూరు : మైదుకూరులో ఎయిడ్స్ దినం సందర్భంగా స్థానిక కడప రోడ్డులోని జెడ్పీ హైస్కూల్ నుంచి రాయల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి వైద్యులు కరీముల్లా, ఐసీటీసీ కౌన్సిలర్ ప్రసాద్, హైస్కూల్ హెడ్మాస్టర్ రమాదేవి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నారాయణరెడ్డి, రెడ్ రిబ్బన్ కోఆర్డినేటర్ అయ్యవారురెడ్డి, ఎన్‌ఎస్ఎస్ కోఆర్డినేటర్ కృష్ణారెడ్డి, ఎస్‌బీఎస్‌వైఎం డిగ్రీకాలేజి ప్రిన్సిపాల్ ఎస్‌బీ సురేష్‌బాబు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ రవికళ్యాణ్ పాల్గొన్నారు.

చాపాడులో..

చాపాడు : ఎయిడ్స్ నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండల వైద్యాధికారి శ్రీవాణి తెలిపారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా శుక్రవారం చాపాడులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ

దువ్వూరు : ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం దువ్వూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్లు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ వ్యాధిపట్ల ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని కోరారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : పారిశుద్ధ్య సమస్యపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. మున్సిపల్ గాంధీ పార్కులో శుక్రవారం మున్సిపల్ కౌన్సిలర్లు, వార్డు సచివాలయ పారిశుధ్య సిబ్బంది, శానిటరీ సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారులు ప్రజా ప్రజాప్రతినిధుల సమన్వయంతో పారిశుధ్య వ్యవస్థలోని లోపాలను గుర్తించి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలన్నారు. సచివాలయ సిబ్బంది సమయ పాలన పాటించాలన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు తమ పరిధిలోని కార్మికులను నిత్యం పర్యవేక్షిస్తూ విధులకు హాజరయ్యే విధానాన్ని పరిశీలించాలన్నారు. మున్సిపాలిటీ పరిధిలో 45వేల గృహాలు ఉన్నాయని, అవసరమైన సిబ్బందిని నియమించి చర్యలు తీసుకోవాలన్నారు. వారానికి ఒక మారు కాకుండా రెండు మూడు మార్లు ఫాగింగ్ చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్లాస్టిక్ నిర్మూలనకు గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. కౌన్సిలర్లు పారిశుధ్య సమస్యపై ప్రజలను చైతన్యవంతులను చేయాలన్నారు. ఇంజనీరింగ్ , పారిశుధ్య విభాగం సమన్వయంతో పనిచేయాలన్నారు. పారిశుధ్య సిబ్బందికి, శానిటరీ సెక్రటరీలకు శిక్షణా కార్యక్రమాలను ఏర్పాటు చేయాలన్నారు. పారిశుధ్య సమస్య పరిష్కారం కోసం ఎంత డబ్బు అయినా ఖర్చు చేసేందుకు మున్సిపాలిటీ సిద్ధంగా ఉందన్నారు. నిబంధనలను అమలు చేయాల్సిన బాధ్యత మున్సిపల్ కమిషనర్‌పై ఉందన్నారు. మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి హయాంలో పనిచేసిన పలువురు మున్సిపల్ చైర్మన్లు సక్రమంగా పారిశుధ్య సమస్యపై పనిచేయకపోవడం వల్లే ఇప్పుడు ఈ సమస్య వచ్చిందన్నారు. ఎక్కడైనా పారిశుధ్య సమస్యపై పనిచేయకపోతే తాను స్వయంగా కాలువలో దిగి మున్సిపల్ కమిషనర్‌కు ఫొటోలు పంపిస్తానని తెలిపారు. మరో మారు సమావేశం నిర్వహించే నాటికి మార్పు కనిపించాలన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది పనితీరు మెరుగుపరుచుకోవాలన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, కమిషనర్ వెంకటమణయ్య, వైస్ చైర్మన్ ఆయిల్‌మిల్ ఖాజా, పద్మశాలి కార్పొరేషన్ చైర్‌పర్సన్ జింకా విజయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, జేసీఎస్ పట్టణ కన్వీనర్లు కాకర్ల నాగేశ్వరరెడ్డి, పోసా భాస్కర్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరిస్తాం

ప్రొద్దుటూరు : మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డు బాలాజీ నగర్-1లోని సమస్యలను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. శుక్రవారం బాలాజీనగర్‌లో ఎమ్మెల్యే పర్యటించారు. కౌన్సిలర్ ముదిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి సిమెంటు రోడ్డు, డ్రైనేజీ సమస్య ఉందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఈ సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. అలాగే ఎమ్మెల్యే ఈ సందర్భంగా అవ్వాతాతలకు పింఛన్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ శివకుమార్ యాదవ్, టౌన్ బ్యాంకు చైర్మన్ కుమార్ రెడ్డి, వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం పదిలం



క్షయవ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం అందజేస్తున్న వైద్యాధికారి

బి.కోడూరు : పౌష్టికాహారంతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని వైద్యాధికారి డాక్టర్ వినీత్‌కుమార్‌రాజు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పవర్‌గ్రిడ్ స్వచ్ఛంద సంస్థ వారు క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారాన్ని అందజేశారు. అనంతరం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ క్షయవ్యాధిగ్రస్తులు మందులతోపాటు పౌష్టికాహారాన్ని తీసుకోవడం వలన ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ నాగముణి, పీహెచ్‌ఎన్ పుష్పాంజలి, టీబీ సూపర్‌వైజర్ నరసింహప్రసాద్, హెల్త్‌సూపర్‌వైజర్ జాన్‌విలియం, విజయలక్ష్మి, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే చర్యలు



రేషన్ పంపిణీపై కార్డుదారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాసులు

ప్రొద్దుటూరు : రేషన్ పంపిణీకి సంబంధించి ఎండీయూ ఆపరేటర్లపై ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని జమ్మలమడుగు ఆర్డీఓ శ్రీనివాసులు తెలిపారు. ఆయన శుక్రవారం మండల పరిధిలోని కాకిరేనిపల్లె, చౌటపల్లె, చౌడూరు గ్రామాలతోపాటు శ్రీనివాసనగర్‌లోని ఎండీయూ వాహనాల వద్దకు వెళ్లి పంపిణీని పరిశీలించారు. పంపిణీ ఆపరేటర్ ఎలా చేస్తున్నారని, ఏవైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దార్ సుదర్శన్‌తోపాటు వీఆర్‌ఓలు పాల్గొన్నారు. అలాగే తహసీల్దార్ నజీర్ అహ్మద్ మండలంలోని పలు రేషన్ పంపిణీ వాహనాలను తనిఖీ చేశారు. ఖాదర్‌బాద్, కొత్తపల్లె, మత్స్యకాలనీతోపాటు ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలోని దస్తగిరిపేట, శ్రీనివాసనగర్ ప్రాంతాల్లో పర్యటించి రేషన్ పంపిణీని పరిశీలించారు.

'నారీ సమ్మేళనం'ను జయప్రదం చేయండి



నారీ సమ్మేళనానికి హాజరైన మహిళా నేతలు

పోరుమామిళ్ల : అన్నిరంగాల్లో మహిళలు రాణిస్తున్నారని, కుటుంబ నిర్వహణలో ప్రతిభ చూపుతూ అటు సమాజానికి, ఇటు కుటుంబానికి విశేష సహకారం అందిస్తున్నారని జిల్లా నారీ శక్తి సమ్మేళనం కన్వీనర్ గంటా గురులక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం పోరుమామిళ్లలో జరిగిన మహిళా విస్తృత సమావేశంలో ఆమె మాట్లాడుతూ స్త్రీ తన శక్తి యుక్తులతో అనాదిగా ప్రజలను, రాజ్యాలను కాపాడిందన్నారు. అలాంటి నారీమణుల సమస్యలు, వివక్ష తదితరాలపై ఈనెల 3న ఆదివారం కడపలో తిరుపతి రోడ్డులోని చిన్మయ మిషన్ వద్ద నిర్వహిస్తున్న సమావేశంలో మహిళలందరూ పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

బీసీ సెల్ మండల అధ్యక్షుడిగా సురేష్



కలసపాడు : మండలంలోని ఎగువ రామాపురానికి చెందిన తెల్లగొర్ల సురేష్‌కుమార్ వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ మండల అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు కడపలో వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు బంగారు నాగయ్య నుంచి నియామకపత్రం అందుకున్నారు. ఆయన మాట్లాడుతూ తన నియామకానికి కృషి చేసిన ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ, బీసీ సెల్ అధ్యక్షులు జిల్లా నాగయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు గురివిరెడ్డి, రామకృష్ణారెడ్డి, సుదర్శన్, నారాయణయాదవ్, పురుషోత్తంరెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

రేపు అయ్యప్పస్వామి లక్షార్చన

ప్రొద్దుటూరు కల్చరల్ : పెన్నానదీ తీరంలోని శ్రీ అయ్యప్పస్వామి ఆలయంలో స్వామి అయ్యప్ప సేవా సంఘం అధ్యక్షుడు నామా రమేష్‌బాబు ఆధ్వర్యంలో ఆదివారం అయ్యప్పస్వామి లక్షార్చన నిర్వహించనున్నట్లు ఉపాధ్యక్షుడు వీఎస్ మనోహర్ తెలిపారు. శుక్రవారం ఆలయంలో లక్షార్చన ఆహ్వాన పత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 40 ఏళ్లుగా లక్షార్చన మహోత్సవాన్ని దాతల, భక్తుల సహకారంతో వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. దాదాపు 40 వేల మంది భక్తులకు అన్న ప్రసాదాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఉదయం 9 గంటలకు లక్షార్చన ప్రారంభమౌతుందని, దాదాపు 2వేల మంది అయ్యప్ప దీక్షదారులు పాల్గొంటారన్నారు. ఈ నెల 12న సాయంత్రం అయ్యప్పస్వామి గ్రామోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో స్వామి అయ్యప్ప సేవా సంఘం కార్యదర్శి పద్మనాభయ్య, కోశాధికారి వినోద్‌కుమార్, కొవ్వూరు రమేష్‌రెడ్డి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

లక్ష కుంకుమార్చన

పోరుమామిళ్ల : పట్టణంలోని శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శుక్రవారం శ్రీ మంగళగౌరీదేవికి లక్ష కుంకుమార్చనను వైభవంగా నిర్వహించారు. గత మూడు రోజులుగా మహిళలు మంగళగౌరీదేవి వ్రతం ఆచరిస్తున్నారు. వ్రతం చేయడం వల్ల మహిళలు సౌభాగ్యవతిగా, సుమంగళీగా, కుటుంబం ఆయురారోగ్య ఐశ్వర్యాలతో వర్ధిల్లుతుందని అర్చకులు కిశోర్‌శర్మ పేర్కొన్నారు. పూజాకార్యక్రమంలో పట్టణ మహిళలు భారీగా పాల్గొన్నారు. హాజరైన వారికి తీర్థప్రసాదాలను అందజేశార


ఆడుదాం ఆంధ్రాను విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి నాగరాజ

గోపవరం : ఈ నెల 15 నుంచి ప్రారంభం కానున్న ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి ఎం.నాగరాజ పేర్కొన్నారు. శుక్రవారం మండల అభివృద్ధి కార్యాలయంలో ఎంపీడీఓ సాయినాయక్‌తో కలిసి అన్నిశాఖల అధికారులు, సచివాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రకు సంబంధించి అన్ని సచివాలయాల పరిధిలో ఆటలపై ఆసక్తి కలిగిన యువతీ యువకుల పేర్లు నమోదు చేసుకునేలా వారికి అవగాహన కల్పించాలన్నారు. అలాగే ఇళ్ళ నిర్మాణాలకు సంబంధించి ఈ నెలాఖరులోపు పూర్తి చేయించాలని హౌసింగ్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లను ఆదేశించారు. ఈ-పంట నమోదు చేయాలని వ్యవసాయ సిబ్బందిని ఆదేశించారు. ఉపాధి హామీ, జగనన్నకు చెబుదాంకు సంబంధించి సమీక్షలో చర్చించారు. సమావేశంలో ఈఓపీఆర్‌డీ హసీనా, అన్నిశాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో ఇక నుంచి హెమటాలజీ అనలైజర్ సేవలు



చాపాడు పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన హెమటాలజీ అనలైజర్ పరికరాలు

చాపాడు : ఇప్పటి వరకూ ప్రైవేటు ఆసుపత్రులతో పాటు జిల్లా, సీహెచ్‌సీ ఆసుపత్రులలో అందే హెమటాలజీ అనలైజర్ సేవలను ఇక నుంచి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో లభించనున్నాయి. ఈ మేరకు చాపాడులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన పరికరాలను పూజలు చేసి వైద్యాధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి రాజేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో గతంలో లేని విధంగా ఇక నుంచి హెమటాలజీ అనలైజర్ సేవలు అందనున్నాయి. రక్త కణాల సంఖ్య పరీక్షలు, కిడ్నీ, హెచ్‌బీ, గర్భ, ప్రెగ్నెన్సీ, మలేరియా, డెంగీ లాంటి 60 రకాలైన పరీక్షలు చేస్తారన్నారు. గతంలో జిల్లా, సీహెచ్‌సీ ఆసుపత్రులలో లభించేవని, ఇక నుంచి పీహెచ్‌సీలలో అందుతాయన్నారు. చాపాడు పీహెచ్‌సీలో సోమవారం నుంచి అన్ని రకాలైన పరీక్షలు చేస్తారన్నారు. కార్యక్రమంలో వైద్యులు శ్రీవాణి, ఓబులేసు, కావ్యమాధురి, ల్యాబ్ టెక్నీషియన్ పద్మ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పంటల సాగులో విత్తన ఎంపిక ముఖ్యం



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సైంటీస్టు జాన్సన్

చాపాడు : రైతులు పంటలు సాగు చేసే సమయంలో విత్తన ఎంపిక ఎంతో ముఖ్యమని ఏఆర్ఎస్ సీనియర్ సైంటీస్టు జాన్సన్ అన్నారు. మండల పరిధిలోని వెదురూరు గ్రామంలో గ్రామీణ విత్తనోపాధి పథకం కింద శుక్రవారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సైంటీస్టు మాట్లాడుతూ ఏ రకమైన విత్తనాలు అధిక దిగుబడులు ఇస్తాయో వాటిని ఎంచుకోవటం ముఖ్యమన్నారు. విత్తన శుద్ధి తప్పనిసరిగా చేయాలని దీనిపై ప్రతి రైతు దృష్టి సారించాలన్నారు. వరి, మినుము సాగు చేసిన రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ప్రస్తుతం సాగులో ఉన్న వరి పంటలను ఆశించిన తెగుళ్లపై అవగాహన కల్పించారు. యూరియాను అవసరం మేరకూ వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌టీసీ ఏఓ పద్మజ, మండల వ్యవసాయాధికారి మ్యాగీ, వీఏఏలు వెంకటరమణ, బేబి, భార్గవి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల చెంతకే ప్రభుత్వ పాలన

సచివాలయం, ఆర్బీకే, వైఎస్సార్ హెల్త్ క్లీనిక్‌లను ప్రారంభించిన ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి



సచివాలయ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి

కాశినాయన : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజల చెంతకే పరిపాలనను తీసుకువచ్చారని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని గంగనపల్లె, గొంటువారిపల్లె గ్రామాల్లో గ్రామ సచివాలయాలు, ఆర్బీకే, హెల్త్ క్లీనిక్‌లను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు సత్వర సేవలు అందుతున్నాయన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి సచివాలయాలు ఉపయోగపడుతున్నాయని తెలిపారు. అనంతరం గొంటువారిపల్లె గ్రామంలో ఆంధ్రాకు జగనే ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ కె.రమణారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ హనుమంతరెడ్డి, సర్పంచ్‌లు ప్రభాకర్‌రెడ్డి, రాములమ్మ, పిచ్చిరెడ్డి, తిరుమలరెడ్డి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

మళ్లీ జగనన్నే సీఎం కావాలి

ప్రొద్దుటూరు : అభివృద్ధి ఇలాగే కొనసాగాలంటే మళ్లీ జగనన్నే సీఎం కావాలని మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, వార్డు కౌన్సిలర్ జిలాని బాషా తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డు ప్రజలకు గడిచిన నాలుగున్నరేళ్లలో రూ.22,41,74,357 లబ్ధి చేకూరిందని వారు తెలిపారు. వార్డు పరిధిలోని జెండా చెట్టు వద్ద శుక్రవారం సాయంత్రం జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల వివరాల బోర్డును ఆవిష్కరించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షులు కామిశెట్టి బాబు, కోనేటి సునంద, కౌన్సిలర్లు ఇర్ఫాన్ బాషా, సత్యం పాల్గొన్నారు.

అన్నివర్గాల సంక్షేమం కోసం జగనన్నే కావాలి

పోరుమామిళ్ల : ఇచ్చిన హామీలను 99 శాతం సీఎం వైఎస్ జగన్ అమలు చేశారని ఆప్కాస్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ కల్యాణ చక్రవర్తి, జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, వైస్ ఎంపీపీలు సీఎం బాషా, రాజశేఖర్, సర్పంచ్ చిత్తా రవిప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పోరుమామిళ్ల 4వ సచివాలయం వద్ద జరిగిన రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలి కార్యక్రమంలో వారు మాట్లాడారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రి అయ్యేలా ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజీవ్‌బాషా, గిరిప్రణీత్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు వసంతరాయలు, ఎంపీటీసీలు ఇస్మాక్, విజయకుమారి, బాబు, మద్దిలేటి, ఎంపీడీఓ వరప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

రాజుపాళెం : రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని మండల ఇన్‌చార్జి ఎంపీపీ నారాయణరెడ్డి అన్నారు. ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం మండలంలోని కొర్రపాడు గ్రామంలో శుక్రవారం సాయంత్రం జరిగింది. ముందుగా సచివాలయాల వద్ద వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించి, సంక్షేమ పథకాల బోర్డును నారాయణరెడ్డి, రాజారాంరెడ్డి, మండల రెండోవ వైస్ ఎంపీపీ సుబ్బరత్నమ్మ ప్రారంభించారు.

ప్రొద్దుటూరు : ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్ తెలిపారు. సీతంపల్లె సచివాలయం వద్ద శుక్రవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. సంక్షేమ పథకాలు, అభివృది వివరాల బోర్డును ఆవిష్కరించారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మార్తల ఓబుళరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఓబయ్య యాదవ్, తులశమ్మ తదితరులు పాల్గొన్నారు.